


'అతను అందంగానే వుంటాడు,' -

అది మృణాలిని అభిప్రాయం. కానీ అతనితో పరిచయం ముఖపరిచయం మాత్రమే. చూపు కలిపి కనీసం ఓ గంటయినా కాలేదు. కారణం ఆదేరోజు వుదయాన ఆ యింటిలో దిగటమే

ఆ యింటిలో ప్రవేశించగానే మృణాలిని క్రొత్తతనం అనుభవించింది. అంతా క్రొత్త. ఏపని చేయబోయినా క్రొత్తగా కనిపించింది; తనవారే క్రొత్తగా కనిపించారు. పిచ్చెక్కినట్లు అనిపించింది. పాత యింటి జ్ఞాపకాలు వెంటాడసాగాయి.

ఆసాయంకాలం, ఏఁవీతోచక, తనకై కేటాయించుకున్న గది కిటికీలోంచి అలఓకగా అలా చూస్తూవుండగా, పాతిక గజాల దూరంలో వున్న బాల్కనీలోంచి ఓ జతకళ్ళు తనని పరిశీలించి చూచినట్లనిపించి, వరాయిమొగాడి చూపు లని తెలీటంతోటే చటుక్కున కిటికీ దాటి అవతలకు వెళ్ళింది. ఐనా తన మనస్సులో అతని తాలూకు ప్రతిమ ఆవలికి వెళ్ళనంది.

మరికొంతసేపటికి మళ్ళీ కిటికీ దగ్గరగా నిలుచుని అతనికోసం ఓక్షణం అటు తిరిగింది. ఐతే అతను ఎటువైపో చూస్తున్నాడు. మృణాలిని కదలిపోలేదు. మరొక్కక్షణం వుండాలని అభిప్రాయపడింది. ఐతే వీలుకాలేదు; అమ్మ పిలుపుకు జవాబుగా కదిలిపోవలసి వచ్చింది.

మర్నాటి ఉదయంవరకు అతనిని మరచిపోయినట్లు భావించుకోటం మంచిదే. ఐనా మృణాలినికి మాత్రం ఆమరపు ఎంతోసేపు నిలువలేదు. కిటికీ బాల్కనీని గుర్తుతెచ్చింది. అదే క్షణాన తనకన్నులు అతనికోసమై పరికించ

సాగాయి. ఐతే 'మనిషిమనసు తరచూ-క్షణికమే' అని మృణాలిని ప్రవర్తన తెలియచేసింది. అలాంటి అభిప్రాయానికి రావటానికి కారణంగా, "తప్పు. పరాయి వాడికోసం అలా చూడకూడదు," అనుకుని, తను గదిలోంచి వెళ్ళిపోయింది. ఐనా అతను మనస్సులోంచి వెళ్ళలేదు. మరి కాసేపటికి అక్కడికే చేరింది. కుర్చీలో కూచుని చెల్లి కేకలు వింటోంది.

బాల్కనీలోంచి వినవచ్చిన మాటలు మృణాలిని చటుక్కున లేచి నిలుచునేట్టు చేశాయి. అటు యిటు చూసింది, చెల్లి గదిలోకి వచ్చిందేమో అని. రాలేదని నిశ్చయానికి రాగానే బాల్కనీవైపు చూసింది. అతని ప్రక్కన మరో అమ్మాయి కూచునివుంది. ఇద్దరూ కులాసాగా నవ్వుకోటం మృణాలినికి రుచించలేదు.

మరొక్కరోజు చూపులతోనే తృప్తి పడింది మృణాలిని. ఏం చేయటానికీ తనకు తోచటంలేదు. 'చెల్లే నయం. ఎంచక్కా వూరంతా ఏకం చేయుగలదు,' అనుకుంది. కిటికీలోంచి అలా చూడటం, 'ప్చ్' అనుకోటం మామూలైంది. పరోక్షంగా అతని సాంగత్యం కోరుకుంది మృణాలిని. ఐనా అప్పుడప్పుడూ, మరో అమ్మాయి అతనితో నవ్వటమూ, కులాసాగా వుండటమూ మృణాలినిని కిటికీనుంచి దూరం చేసేవి. 'అతను...! ఏమో ! ప్రేమిస్తున్నానేమో !' అనుకుంది. 'ప్రేమ' అనుకునేసరికి, 'కారు, హోదా, భర్త అందమూ-వూఁ! అందానికేం! అందంగానే వుంటాడు. లేకపోతే నామనసులోకి వచ్చేవాడా ?'-అలా ఆలోచనలు వెన్నంటేవి.

ఐదోరోజు మృణాలిని మనసు మొండికేసింది. చెల్లిని పిలిచి ఎదురింటి బాల్కనీ గురించి భోగట్టా చేసేవరకు మారాము చేసింది. 'చెల్లి - సింసింద్రీ లాంటిది. ఐనా ఎంతోమంచిది,' అనుకుంది, తనకు కావలసిన వివరాలువచ్చేసరికి. 'అమ్మో! అనవసరంగా భయపడ్డాను. ఆ అమ్మాయి అతని చెల్లెలే నన్నమాట!' – తేలికగా వూపిరి పీల్చింది.

బాల్కనీవైపు చూసింది. అతను అతనిప్రక్కన అతనిచెల్లెలు. ఒక్కమాటు వులిక్కిపడింది మృణాలిని. 'అదేఁవిటి ? అతన్ని చేయిపట్టుకు నడిపిస్తోందేం ?' వెంటనే కేకపెట్టింది. "జానకీ, జానకీ, ఒసేవ్ ! యిలారా ! ఆ విషయం చెప్పనేలేదేం ?" - ఇంకా చూపులు బాల్కనీవైపే వున్నాయి. వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఏఁవిటే ఆ గావుకేకలు. కొంప లంటుకున్నట్టు ?" – అంటూ జానకి వచ్చింది.

"నిజంగా అంటుకునేవే! ఆయనగార్ని వాళ్ళచెల్లెలు చేయిపట్టుకు నడిపిస్తోందేవిటి ? ఒంటో బావుండలేదా ?"

"అదా! ... వూఁ. చూస్తూనేవున్నా : ఈమధ్య ఆయన్నిగురించి ఆరా తీస్తు

న్నావు. నీ కెందుకే?'' – నడ్డిమీద చేతు లుంచుకుని ఆరిందాలా ప్రశ్నించింది జానకి నవ్వుతూ.

''ఛస్! నోరుముయ్యవే! అడిగిం దానికి జవాబు చెప్పు.''

"ఓస్! ఎందు కింతకోపం? చెప్తా కానీ నా కేం ఇస్తావ్?''

''ముందు చెప్పవే మొద్దూ!" – అన్యా యము జరిగిపోయేదని కోపం ముంచుకు వస్తోంది మృణాళినికి.

జానకి నవ్వాపుకుంది రోజూ అతన్ని చూడటమూ, ఆయన చెల్లెల్ని ఆసరా చేసుకుని సెడవటమూ, ఆంటిసి కుంటివా డన్న అభిప్రాయాన్ని జానకిలో తెచ్చాయి. ఆ సంగతే మృణాళినికి తెలియచేసి వెళ్ళిపోయింది. అంతకు మున్నే, 'ఏవిఁటీ?' అనుకుంది మృణా ళిని. తేరుకుని చూసేసరికి క్రిందపీధిలో అన్నా చెల్లెళ్లు వెళ్తూ కన్పించాడు.

'ఐతే నిజఁవే విన్నమాట' అను కుంది మృణాళిని. వెంటనే ప్రేమ, కారు, హోదా, భర్త అందుతూ గుర్తుకు వచ్చాయి.

''హుఁ! ఇంకా నయ్యఁవ్. ఆడుసతో స్నేహం చేద్దాఁ వనుకున్నాను. ముందే తెలిసింది. సరి! చూసిచూసీ కుంటివా డితో కాపురఁవా?'' అనుకుంది.

మరి కిటికీ ఆయన్ని గుర్తుచేసినా, మనసు మనిషిని మరోవైపు త్రిప్పేది. తర్వాత బాల్కనీ కన్పించటం మానే సింది తనకు. అథవా కన్పించినా 'ఎదు రింటివాళ్లు బాల్కనీ యిటువైపు కట్టించా రెందుకో? బుద్ధి లేపోతేసరి!' అను కునేది.

మరి నాల్రోజులు క్షణాల్లా గడిచాయి.

కాఫీ చప్పరిస్తూ, కిటికీ దగ్గరగా నిలుచున్న మృణాళిని అలా వీధివైపు చూసి ఆశ్చర్యపోయింది.

'అరే! అతనే! ఒంటరిగానే!' – నమ్మలేకపోయినా నిజం కనుక నమ్మే యాల్సి వచ్చింది. అవాక్కయి చూస్తోంది. అతను ఆగేడు. మరో పెద్ద మనిషి సమీపిస్తూ, "ఏఁవిటోయ్ కరుణా కరం! ఆమధ్య నీ కాలు బెణికిం దన్నారు. తగ్గిందా!" – గట్టిగానే పలుక రించాడు. అతను నవ్వేడు.

"ఆఁ ఆ! తగ్గిందండీ! ఓ వారం రోజులు చాలా బాధపెట్టింది, నడువనీ కుండా. ఇప్పుడు సమమైంది లెండి..." మిగిలిన మాటలు మృణాళినికి విన్పించ లేదు.

''ఏవిఁటీ!" – అనుకుంది.